రైతులకు కావలసిన వరి విత్తనలు సరఫరా ఎప్పుడు?

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సూటి ప్రశ్న

విశాలాంధ్ర-పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లాలో పూర్తిగా వ్యవసాయ ఆధారం.అందులో ప్రధానంగా వరి సాగు సుమారు1,75,000 ఎకరాలు సాగు అవుతుంది. వచ్చే ఖరీఫ్ సీజన్ గాను సుమారు ఐదున్నర టన్నులు వివిధ రకాలైన వరివిత్తనలు అవసరమై ఉన్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు మొత్తంలో కేవలం 33 శాతం మాత్రమే వరి విత్తనాలు సరఫరా చేయడం ఆనవాయితగా మారింది. ఉత్తరాంధ్రలో అత్యధికంగా సాగు చేస్తున్న సంపద మసూరి అత్యధిక భాగం వరి పంట సాగు అవుతుంది. కానీ పాలకపాక్షాలు మారుతుండొచ్చు గాని వారి విధానంలో మాత్రం రైతులకు కావలసిన వరి విత్తనాలను సరఫరా చేయడంలో పాలకులు విఫలమవుతూ ఉన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని రకాల వరి విత్తనాలు సుమారు ఐదున్నర టన్నులు కావలసి ఉంది కానీ ప్రస్తుతానికి సుమారు రెండంపావు టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపు కోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం స్థానిక విలేకరులతో కొండాపురం గ్రామంలో మాట్లాడుతూ దీనివల్ల రైతుల కు కావలసిన ప్రధాన విత్తనమైన సంపదమసూరి ప్రైవేట్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతుకు దాపరుస్తుంది.ప్రతి విత్తనాలు ప్రైవేటు వారి దగ్గర కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది ఒక్క గింజ కూడా ప్రభుత్వం సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉంది.కౌలు రైతులకు భూ యజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని అప్పలనాయుడు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న రైతు నాయకులు కిమిడి రామ్మూర్తి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు. బచ్చల పారినాయుడు,మజ్జి సన్యాసినాయుడు,బచ్చల గౌర్నాయుడు,గండ్రేటి గురువులు తదితరులు ఉన్నారు.

పాచి పెంటలో ఉరుములతో కూడిన వర్షం

విశాలాంధ్ర-పాచిపెంట: పాచిపెంట మండలంలో శనివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది . గత రెండు రోజులుగా ఉక్క పోతతో అల్లాడిన జనాలకు ఉపశమనం కలిగించినప్పటికీ పాడిపంటలకు వేతగా లాభదాయకం కాదని రైతులు వాపోతున్నారు. బీభత్సమైన ఉరుములతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గంట పాటు ఏకధాటిగా ఉరుములు మెరుపులతో మండల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గంటసేపు కురిసిన వర్షంతో పాటు ఉరుములు మెరుపుల బీభత్సం సృష్టించింది.

తాసిల్దార్ వై జయలక్ష్మి కు బదిలీ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: స్థానిక తహసిల్దార్గా విధులు నిర్వహిస్తున్న వై జయ లక్ష్మి కు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ చేశారు. ఈమెను పార్వతీపురం నుండి జిఎం వలస మండలానికి బదిలీ అయినట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. ఈమె స్థానంలో నూతన తాసిల్దార్ గా భోగాపురంలో విధులు నిర్వహిస్తున్న ఎం. సురేష్ ఇక్కడి బాధ్య తలు నిర్వహించనున్నారు. గతంలో తాసిల్దారుగా విధులు నిర్వహించిన జయలక్ష్మి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే విజయ్ చంద్ర పై ఆరోపణలు చేయడమే కాకుండా తన విధులకు ఆటంకం కలిగి స్తున్నారని నేరుగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాసిల్దార్ లంచాలు తీసుకుంటున్నారని, విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఎమ్మెల్యే విజయ్చంద్ర ఘాటుగా ఆరోపిస్తూ ఒక దశలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జయలక్ష్మి కు జిఎం వలస బదిలీ కావడం గమనార్హం .శాఖా పరంగా సాధారణ బదిలీల్లో భాగంగానే స్థానచలనం కలిగించినప్పటికీ రాజకీయ కోణం కూడా ఉన్నట్లు పలువురు అంటున్నారు.

కొందరికే కాదు.....అందరికీ ఇవ్వాలి.....

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్



విశాలాంధ్ర-బెలగాం: తల్లికి వందనం పథకం కొందరికే కాదని అందరికీ వర్తింపచే యాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల పేరుతో అధికమంది విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఎటువంటి షరతులు లేకున్నా విద్యార్థులందరికీ 15,000 ఇస్తామని మాట ఇచ్చి ఇప్పుడు కోత పెట్టి 13,000 ఇవ్వడం విచారకరం అన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వినియోగించిన వారికి, అతి తక్కువ జీతంతో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కుటుంబంలో ఉన్న పిల్లలకు పథకాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. ఒకే కుటుంబంలో పాఠశాల, డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే, ఒకరికి మాత్రమే ఏదైనా పథకం వర్తిస్తుందని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం మాటలు ఆకాశాన్ని తాకుతున్నాయి గాని ఆచరణలో కనీసం గడప దాటే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం

విశాలాంధ్ర-కొమరాడ: కొమరాడ మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీవర్షం శనివారం సాయంత్రం నుండి రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. రోడ్లన్నీ జలమ యమై నదులను తలపించాయి. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం మూడు గంటల తర్వాత మేఘాలలో ఒకసారి మార్పు రావడంతో సాయంత్రానికే ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతో అల్లాడుతున్న వృద్ధులు వికలాంగులు గర్భిణీలు, ప్రజలు కు నేటితో వాతావరణం చల్లబాటులో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఋతుపవనాలు రాకతో ఆంధ్ర వర్ష సరిహద్దు ప్రాంతాల్లో గత రెండు మూడు నెలలు ఉండి చూడన వర్షం వర్షం కురవడంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రైతులు రానున్న రోజుల్లో ముందస్తు ఎరువులు వేసుకోవడానికి ఈ వర్షం చాలా అవసరమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెల్లంనాయుడువలసలో యోగాంధ్ర

విశాలాంధ్ర-సీతానగరం: జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు మండలం లోని చెల్లంనాయుడువలస గ్రామం లోని పాఠశాల ఆవరణలో శనివారం నాడు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వాకాడ పారినాయుడు, ఉప సర్పంచ్ ,పంచాయతీ మెంబర్స్, మహిళలు, అంగన్వాడీ కార్యకర్త, ఆశ వర్కర్, ప్రజలు పాల్గొన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ అందరిచేత యోగాను చేయించారు.

గాదెలవలసలో యోగాంధ్ర

విశాలాంధ్ర-సీతానగరం: జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మండ లంలోని గాదెలవలస గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొన్నాడ తిరుపతిరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు, కార్యదర్శి మనోహర్,పంచాయతీ మెంబర్స్, మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్, సచివాలయం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో

డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర-బెలగాం: ప్రస్తుత జీవన విధానంలో యోగాను ప్రతీ ఒక్కరూ దినచర్యలో బాగంగా అలవాటు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో శనివారం యోగా సెషన్ నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. డిఎంహెచ్ఓ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిపి యోగాసనాలు చేసారు. అనంతరం యోగా ప్రయోజనాలపై డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని, రోగనిరోధక వ్యవస్థ బలపడి పలు రోగాలకు గురికాకుండా చేస్తుందని, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందని ప్రస్తుత జీవన విధానంలో యోగా ఆవశ్యకత చాలా ఉందని ప్రతీ ఒక్కరూ యోగాను దినచర్యలో బాగంగా అలవాటు చేసుకోవాలని, వయస్సుకు, సౌష్టవానికి తగ్గట్టుగా చేయాల్సిన ఆసనాలు యోగా శిక్షకుల వద్ద అభ్యాసన అవసరమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 21 వరకు ప్రస్తుతం కొనసాగుతున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, బందలుప్పి పిహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎం.కె తిరుమల ప్రసాద్, సర్పంచ్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో

డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర-గరుగుబిల్లి: ప్రస్తుత జీవన విధానంలో యోగాను ప్రతీ ఒక్కరూ దినచర్యలో బాగంగా అలవాటు చేసు కోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధి కారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సన్యాసిరాజుపేట గ్రామంలో శనివారం యోగా సెషన్ నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. డిఎంహెచ్ఓ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిపి యోగాసనాలు చేసారు. అనంతరం యోగా ప్రయోజనాలపై డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని, రోగనిరోధక వ్యవస్థ బలపడి పలు రోగాలకు గురికాకుండా చేస్తుందని, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందని ప్రస్తుత జీవన విధానంలో యోగా ఆవశ్యకత చాలా ఉందని ప్రతీ ఒక్కరూ యోగాను దినచర్యలో బాగంగా అలవాటు చేసుకోవాలని, వయస్సుకు, సౌష్టవానికి తగ్గట్టుగా చేయాల్సిన ఆసనాలు యోగా శిక్షకుల వద్ద అభ్యాసన అవసరం అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 21 వరకు ప్రస్తుతం కొనసాగుతున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, గరుగుబిల్లి పిహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ .ఎస్ సంతోషకుమార్ సర్పంచ్ జే తిరుపతిరావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకంతో పేదల ఇంట్లో పండుగ వాతావరణం : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ-సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనలో భాగంగా తల్లికివందనం పథకాన్ని విద్యాసంవత్సరం ప్రారంభం రోజే అందించడం తో తల్లుల ముఖాలలో ఆనందం వెల్లి విరెస్తుందని మంత్రి సంధ్యారాణి అన్నారు.కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ పథకం వర్తింప జేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.గత వైకాపా ప్రభుత్వం అమ్మఒడి పేరిట 42 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే పథకాన్ని వర్తింపజేశారన్నారు.కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో 67 లక్షలమందికి పథకాన్ని అందజేశామన్నారు.ఆంధ్రప్రదేశ్ లో మహిళల ముఖాలలో ఆనందం చూసి తట్టుకోలేని వైకాపా వాళ్లు చవకబారు విమర్శలు చేస్తున్నారన్నారు.11 సీట్లతో ప్రజలు బుద్ధి చెప్పిన వారి విధానం మారడం లేదన్నారు.పాఠశాలలో మౌళికవసతుల కల్పన,పాఠశాల నిర్వహణ తీరు మెరుగుపర్చేందుకు వీలుగా రెండు వేల రూపాయలు కేటాయిస్తే వాటిని లోకేష్ బాబు జేబులోకి వెళ్లాయంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అనుసరించిందన్నారు.గత ప్రభుత్వ విధానాలలో మంచిని పాటిస్తామని,రద్దులు,కూల్చివేతలు లాంటి పిచ్చి పనులను మాత్రం చేయమన్నారు.పాఠశాలలు ప్రారంభం నాడే స్కూల్ బాగ్స్, యూనిఫాం, పుస్తకాలు, సన్న బియ్యం ను ప్రభుత్వం ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా సరఫరా చేసింద న్నారు. గత ప్రభుత్వం హయాం లో అన్నిటిపై దిష్టిబొమ్మ లా జగన్మోహన్ రెడ్డి బొమ్మ ను ముద్రించి పంపిణీ చేసేవారన్నారు.కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు.కేవలం రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర తోనే పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వం హయాంలో బటన్ నొక్కినా డబ్బులు ఖాతాలో జమ అయ్యేవి కాదన్నారు.ప్రస్తుతం నేరుగా తల్లుల ఖాతాలకు డబ్బు చేరుతుందన్నారు.తల్లికి వందనం పథకం అందని వారు దగ్గర్లో ఉన్న సచివాలయానికి వెళ్లి ఎందుకు పథకం వర్తింపజేయడం లేదో సరిచూసుకోవాలని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని కొనియాడారు.అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమం లో ఆమె తో పాటు మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్దేవ్,పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి,సాలూరు, మక్కువ మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుళ్ళ వేణుగోపాల్, ఎఎంసి ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు కరిబుగత భాస్కరరావు,మత్స్యశ్యాం,యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 21 వరకు యోగ సాధన

ప్రతి ఒక్కరూ సాధన చేసే విధంగా చర్యలు తీసుకోండి

సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : గ్రామ, మండల, జిల్లా స్థాయి యోగా పోటీలు పూర్తయ్యాయని, ఈ నెల 14 వ తేదీ శనివారం నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం 21వ తేదీ వరకు ప్రతి సచివాలయ ఫరిధిలో యోగ సాధన జరగాలని సంయుక్త కలెక్టర్ డా. ఎం జే అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం జేసి జిల్లా, మండల అధికారులు, యోగ ట్రైనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 3,292 యోగా కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, అన్ని కేంద్రాలలో ఈ వారం రోజులు యోగ సాధన జరగాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, డివిజన్, మడన్ల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు వారికి దగ్గరగా ఉన్న సచివాలయ ఫరిధిలో యోగ సాధన చేయాలని సూచించారు. జిల్లా అధికారులు యోగ సాధన చేస్తూనే యోగ సాధన పర్యవేక్షించాలని ఆదేశించారు. అదే విధంగా యోగ సాధన పోటోలను నోట్ కేమ్ యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజ లను చైతన్య పరచి యోగ సాధనకు ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలో 4.62 లక్షల మంది యోగ సాధనకు నమోదు చేసుకున్నారని జేసి తెలిపారు. నమోదు చేసు కున్న వారందరూ శనివారం నుండి వారం రోజులు యోగ సాధన ప్రక్రియలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, యోగా డే అనంతరం వారు యోగ సాధన నిరంతర ప్రక్రియగా అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా యోగ నోడల్ అధికారి ఎం వి ఎస్ లోకేస్వర రావు, జిల్లా, మండల స్థాయి అధికారులు, యోగ ట్రైనర్లు పాల్గొన్నారు.

వితంతు మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలి

మాజీ ఎంపీటీసీ శివరామరాజు

విశాలాంధ్ర-కొయ్యూరు: వితంతు మహిళలందరికీ పెన్షన్లను మంజూరు చేయాలని కొయ్యూరు మండలం మంప మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివరామ రాజు శనివారం ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పౌజ్ పెన్షన్లను పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల, వైసీపీ పాలనలో పలువురు వితంతువులకు పెన్షన్ రాలేదన్నారు. వారందరికీ కూడా ప్రభుత్వం పెన్షన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు..

యోగా కాదు ముందు రోడ్లు వేయాలి

వినూత్న రితిలో గిరిజనులు నిరసన

విశాలాంధ్ర-అనంతగిరి: మండలం జీనబాడు పంచా యతీ కోండ శిఖర పాలభంద గ్రామానికి పారెస్టు అదికా రులు వెంటనే అనుమతులు ఇవ్వాలని రోడ్డు పనులు వెంటనే ప్రారంబించాలని యోగా కాదు రోడ్లు వేయండి మహప్రభో అంటు శనివారం ఆదివాసీ గిరిజనులు వినూత్న రీతిలో నిర్సన తెలిపారు,మాకు యోగ వద్దు రోడ్లు వేయండి! అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విరికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న పల్గోని మాట్లాడారు స్వాతంత్ర్య వచ్చి 80 ఎళ్ళకు అడుగు పెడుతున్న కంప్యూటర్ కాలంలో విజన్ 2047 అంటు ముఖ్యమంత్రి కళలు కంటున్న కూటమి ప్రభుత్వ సంవత్సర కాలం సంభరాలు జరుపు కుంటున్న గిరిజనో ద్ధరణ పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడవి బాట పట్టిన నేటికీ గిరిజనులకు మౌళిక సదు పాయాలు కల్పించడంలో పూర్తిగా విఫల మయ్యారని, అగ్రహారం వ్యక్తం చేశారు, ఈగ్రామానికి జిల్లా కలెక్టర్ గారు గిరిజనులు కష్టాలు గుర్తించి ఎంఎన్ఆర్ఈఎస్ నిధులతో రోడ్లు మంజూరు చేసిన పారెస్టు అదికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో నాలుగు రోజులు నుండి ప్రోక్లైన్ నిలిచి పోయిందని తెలిపారు దీంతో నిదులు వెనుకకు వెళ్ళి పోయే ప్రమాదం ఉందన్నారు వర్షాకాలం వస్తే పనులు ముందుకు సాగవని అన్నారు ,దింతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు మరిన్ని ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలిపారు ఉపాధ్యాయులు రోజు పాఠశాల వెళ్ళాలన్న నిత్యవసర వస్తులు తెచ్చుకోవాలన్న చిన్న పిల్లలు ముసలి వారు గర్బినిలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు వెంటనే పారెస్టు ఆదికారులు అనుమతులు ఇచ్చి రోడ్డు పనులు ప్రాంబించాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో చేదల రాంబాబు వంతల గుండుబాబు తామార్ల ఈశ్వరావు మామిడి లక్షమణ రావు కించిగంగన్నదోర చేదల సన్యాసమ్మ కించసన్యాసమ్మ తామార్ల చిన్నాలమ్మ కాకర శ్రీను తోపాటు అదికసంఖ్యలో గిరిజనులు మహిళలు పాల్గొన్నారు.

మాయ మాటలతో ఘరానా మోసం!

- నమ్మి చెడిన అమాయక గిరిజనులు
- కలెక్టర్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరపాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-చింతపల్లి : ఆదివాసి ట్రస్ట్ బాధితులతో జిల్లా కలెక్టర్ బహిరంగ విచారణ నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్,. ట్రస్ట్ బాధితుల సంఘం జిల్లా నాయకుడు చిక్కుడు అశోక్ లు అన్నారు. మండలంలోని అంతర్ల గ్రామంలో ఉన్న ఆదివాసి ట్రస్ట్ లో ట్రస్ట్ లో డబ్బులు కట్టి మోసపోయిన బాధితులు ట్రస్టు చైర్మన్ మోసానికి వ్యతిరేకంగా ఈ మధ్యకాలంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించిన విషయం పాఠకులకు విధితమే. ఈ సమస్యపై ట్రస్ట్ బాధితులు, జిల్లా కలెక్టర్, ఎస్.పి లకు వినతిపత్రం సమర్పించారు, స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు, ఈ క్రమంలో విచారణ బృందం శుక్రవారం అంతర్ల ట్రస్ట్ ప్రధాన కార్యాలయం కి చేరుకున్నారు. అప్పటికే విషయం తెలుసుకున్న బాధితులు అధిక సంఖ్యలో ట్రస్ట్ వద్దకు చేరుకున్నారు, ట్రస్టు చైర్మన్, బాలం పడాల్ సహా, ఆదివాసి డైరెక్టర్లు 11 మందిని విచారణ బృందం అధికారులు విచారించారు. ఉన్నతాధికారులు కాకుండా క్రింది స్థాయి ఉద్యోగులు విచారణ చేయడాన్ని బాధిత ట్రస్టు సభ్యులతో కలిసి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తప్పు పట్టారు, ట్రస్టు సభ్యులుగా 250 రూపాయలు మాత్రమే తీసుకొని దానికే రసీదు చూపించి, ఒక ఐడి 12,200 కడితే నెలకి 3000 చొప్పున ఎన్ని ఐడీలు కడితే అన్ని 3 వేలు నెల నెల ఇస్తామని, అలా ఏడు తరాలు చెల్లిస్తామని నమ్మ బలకడంతో ఏ రకమైన రసీదు లేకుండా అమాయక గిరిజనులు సాటి గిరిజనుడైన ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలం పడాల్ కి నమ్మకంతో కట్టిన డబ్బులను సుమారు 6 మాసాలుగా సభ్యులకు చెల్లించకుండా ట్రస్ట్ చైర్మన్ మోసగించడాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టారు. ఇటీవల కాలంలో ట్రస్ట్ చైర్మన్ బాలంపడాల్ అనేక సమావేశాలలో ఐడిల కోసం మాట్లాడిన సందర్భాలు అనేకం ఉన్నాయని, వాటిని ఆధారం చేసుకొని పోలీసులు సుమోటుగా కేసు నమోదు చేసి బాధితులు అందరికీ డబ్బులు చెల్లించే విధంగా న్యాయం చేయాలని కోరారు, ఈ విధంగా బాధితులకు న్యాయం జరగాలంటే జిల్లా కలెక్టర్ సమక్షంలో బాధితులతో కలిసి బహిరంగ విచారణ చేపడితే అనేక విషయాలు బాధితుల నుండి బహిర్గతం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్పులు చేసి, పశువులు, మేకలు అమ్మి, భూములు, బంగారాలు, పవిత్రంగా భావించే పుస్తెలు కుదువబెట్టి డబ్బులు చెల్లిస్తే, నేడు వారందరినీ బజారున పడేసారని వారు ఆరోపించారు. క్రింది స్థాయి అధికారులను విచారణ అధికారులుగా నియమించడం వలన సరైన దర్యాప్తు జరగదని, బాధితులకు న్యాయం జరగదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఒకరోజు సమయం కేటాయించి చింతపల్లి కేంద్రంగా విచారణ చేపడితే బాధితులు అందరినీ తామే తీసుకువస్తామని, మోసపోయిన అమాయక గిరిజన బాధితులందరికీ జిల్లా కలెక్టర్, ఎస్ పి సహా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు, లేదంటే బాధితులతో కలిసి జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి వండలం బాలయ్య, అడప విష్ణుమూర్తి, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, గడుతూరి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, అధిక సంఖ్యలో ట్రస్ట్ బాధితులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపులో న్యాయస్థాన అదేశాలు అమలు చేయాల్సిందే..?

- న్యాయస్థానం ఆదేశాల మేర ఆక్రమణలు తొలగింపు చేపట్టకపోతే రహదారిపై పెద్దఎత్తున ఆందోళన
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

విశాలాంధ్ర-పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంతో పాటు ఏజెన్సీలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు కొనసాగించాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేస్తున్నారు. శనివారం పాడేరు పట్టణంలో గిరిజనులతో కలిసి రోడ్డుపై బైఠాయించి 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాల్సిందే అంటూ నినాదాలు చేపట్టారు. దీంతో సుమారుగా గంటకు పైగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిన జిల్లా ఉన్నతాధికారులు రోజుకో మాట మాట్లాడి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పాడేరు పట్టణంలో మొత్తంగా 100 అడుగులు, మండల కేంద్రాల్లో 50 అడుగుల మేర ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిందే నన్నారు. హైకోర్టు ఆదేశాలు పాటించ కుండా స్థానిక గిరిజ నేతర వ్యాపారులు, వర్తకుల విజ్ఞప్తులకు అధికారులు తలొగ్గ డం ఏమిటనీ ప్రశ్నించారు. మెజార్టీ గిరిజనుల డిమాండ్ ను అమలు చేయాల్సిన అధికారులు ఎందుకు రోజుకో మాట మారుస్తున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎవరి మేలు కోసం జిల్లా ఉన్నతాధికారులు, ఐటిడిఎ అధికారులు పనిచేస్తున్నారన్నారు. రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపులో కూటమి నాయకుల జోక్యం సరికాదన్నారు.గిరిజన ప్రాంతాల్లో అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న గిరిజన రాజకీయ నాయకులు ఆక్రమణల తొలగింపు, విస్తరణ పనులకు సహకరించాలన్నారు. రోడ్లపై స్వచ్ఛందంగా వచ్చి ఎవరి పక్షాన, ఏ పక్షాన ఉన్నారో తెలియజేయాలన్నారు. హైకోర్టు ఆదేశాలను జిల్లా ఉన్నతాధికారులు ఖచ్చితంగా అమలు చేయాలని లేని పక్షంలో స్థానిక గిరిజనులతో పాటు కలిసి వచ్చే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆక్రమాణాల తొలగింపు చేపట్టకపోతే రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా మూగజీవులు

- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ: మండ లంలోని అరకు సంతబయలు గ్రామంలో అరకు పాడేరు ప్రధాన రహదారిలో మూగజీవులు రోడ్డుకు అడ్డంగా ఉండడం వల్ల రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. అందాల అరకులోయ ప్రాంతంలో వందలాది పర్యాటకులు నిత్యం సందర్శిస్తుంటారని, దీంతో అరకులోయకు అరకు సంతబయలు ఆనుకుని ఉండటం వల్ల అరకు పాడేరు ప్రధాన రహదారిలో నిత్యం రద్దీగా ఉంటుందని, మూగ జీవులు రోడ్డుపై ఉండడం వల్ల అతివేగంగా కొన్ని వాహనాలు వస్తుంటాయని దీంతో రోడ్డుపై ఉన్న మూగజీవులు వల్ల యాక్సిడెంట్లు అయ్యే ప్రమాదం ఉందని స్థానికులతో పాటు పలువురు అంటున్నారు. నోరులేని మూగజీవులను యజమానులు రోడ్డుపై నిర్లక్ష్యంగా ఇలా వదిలేయడం సరికాదని పలువురు అంటున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రోడ్డుపైనే మూగజీవులు ఉండటం వల్ల రాకపోక సాగించే వాహనా దారులు పలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు. మూగజీవులపై నిర్లక్ష్యంగా రోడ్డుపై వదిలేసిన యజమాన్యాలపై చర్యలు తీసుకొని మూగజీవులను గోసాలలకు తరలించాలని పలువురతో పాటు వాహన చోదకులు అంటున్నారు.

కృష్ణకుమారికు గ్లోబల్ స్టార్ ఐకాన్ అవార్డ్స్

విశాలాంధ్ర-డుంబ్రిగుడ: ఆదివాసి మన్యం ముద్దు బిడ్డ మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి చేసిన అనేక సేవలను గుర్తించి హైదరాబాదు కళా మారుతి వేదిక లో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ నటులచే ఆమెకు గ్లోబల్ స్టార్ ఐకాన్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ మన్య ప్రాంతంలో నేను చేస్తున్న సేవలను గుర్తించి సినీనటుల ద్వారా అవార్డు అందించడం సంతోషకరంగా ఉందని, నా సేవలను గుర్తించిన ఫౌండేషన్ కు కృతజ్ఞతలు చెప్పారు.

పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు నోచుకొని మారుమూల గ్రామాలు

విశాలాంధ్ర-జీ.కే వీధి: జర్రెల పంచాయతీ పరిధిలో మారుమూల గ్రామాలైన కన్నీరుశిల్ప, గాడిమామిడి, గునుకురాయి, అసంపల్లి, తిరగేలమామిడి, బొడ్డలగొంది గ్రామాలకు ఇప్పటికీ పాఠశాలలు లేక పిల్లలు విద్యకు దూరమ య్యారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు గ్రామాల ప్రజలు పాఠశాలలు లేవని ఈ గ్రామాలకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. తమపిల్లలు భవిష్యత్తు కాపాడాలని పిల్లల తల్లిదండ్రులు వేడుకున్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
ఆదివారం 15, జూన్ 2025

కోటసీతారాంపురంలో కొనసాగుతున్న ఏనుగులగుంపు తిష్ట

విశాలాంధ్ర-సీతానగరం :మండలంలోని కోటసీతారాంపురం లో ఏనుగులు గుంపు తిష్టవేసి ఉన్నాయి. గత వారం రోజులుగా సీతానగరం మండలంలోని ఏనుగులు ఉండడం, కోట సీతారాంపురం గ్రామానికి దగ్గరలో టేకు తోటలో గున్న ఏనుగుకు జన్మనివ్వడం తెలిసిందే. గున్నఏనుగు కన్న తర్వాత ఏనుగులు గుంపు కదలడం లేదు. ఏనుగులు గుంపును చూడడానికి సీతానగరం మండలప్రజలతో పాటు బొబ్బిలి మండల ప్రజలు,పురపాలక ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తూ ఫోటోలు వీడియోలు తీస్తున్నారు. ఏనుగుల గుంపువైపు ప్రజలు వెళ్లవద్దని, ఫోటోలు తీసుకోవద్దని, వీడియోలు తీయవద్దని అటవీశాఖ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు దండోరా వేస్తున్నారు.

యోగాతో మానవునికి అనేక ఉపయోగాలు

ఎంపీడీవో ప్రేమ్ సాగర్

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: యోగాతో మానవునికి అనేక ఉపయోగలు, పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో ప్రేమ్ సాగర్ అన్నారు. అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల మైదానంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగ ద్వారా మానవ శరీరానికి అనేక ఉపయోగాలు ఉంటాయని చెప్పారు. మానవుని శరీర భాగాలకు సంబంధించి అనేక రకాల భంగిమలు ద్వారా యోగ చేసినట్లయితే మానవ శరీరం దృఢత్వంగా ఉండి ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. యోగ ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చెప్పారు. నిత్యం యోగ చేసినట్లయితే రోగాలకు కూడా దూరంగా ఉండొచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తాసిల్దార్ ముజీబ్ ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టులో చోటు చేసుకున్న పరిణామాలపై విచారణ

ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలం పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : ఆదివాసి ట్రస్ట్ లో ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్న పరిణామాలపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఆయన వేసిన విచారణ బృందం అంతర్ల గ్రామంలోని ఆదివాసి ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సుధీర్ గంగా విచారణ జరిపారు. ఆ ట్రస్ట్ చైర్మన్ కే బాలం పడాల్, ఉపాధ్యక్షుడు ఉపాధ్యక్షుడు కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి వండలం బాలయ్య ల సహా మరో ఎనిమిది మంది డైరెక్టర్లు, పలువురు సభ్యులను సుదీర్ఘంగా విచారించారు. ఈ నివేదిక ను కలెక్టర్ కు స్థాపించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ మన్యప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు అయిన తమ ట్రస్ట్ లో 2,40,000 మంది సభ్యులు ఉన్నారని, ఒక్కొక్క సభ్యుని వద్ద సభ్యత్వ నమోదు కోసం 250 రూపాయల చొప్పున వసూలు చేయడం జరిగిందన్నారు ఎంతో సాఫీగా నడుస్తున్న ఆదివాసి శ్రీ అసాంఘిక శక్తులు చేరి తమ స్వప్రయోజనాల కోసం ట్రస్ట్ ను బజారుకు ఈడ్చారన్నారు. ఉపాధ్యక్షుడు చిన్నబ్బాయి, కార్యదర్శి బాలయ్యల ఖాతాలలో కోటి 38 లక్షల 50 వేల రూపాయలు జమ చేశానని, అవి తీసి సభ్యులకు ఇవ్వవలసి ఉండగా, ఆ డబ్బు తీసి ఇవ్వాలని కోరిన తనపై చిన్నబ్బాయి, బాలయ్యలు తప్పుడు ప్రచారం చేసి ట్రస్టును బజారుపాలు చేశారని, దీనిపై విచారణ జరిపించాలని కలెక్టర్ ను కోరిన మీదట నేడు (శుక్రవారం) తమ ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో అధికారులు విచారణ నిర్వహించారని ఆయన తెలిపారు.

చారిటీ ట్రస్ట్ ద్వారా అనాథ పిల్లలకు సామగ్రి పంపిణీ



విశాలాంధ్ర-దుంబ్రిగుడ: అరకు సంత బయలులో శనివారం యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 28 మంది పేద, అనాథ పిల్లలకు ఉచితంగా యూనిఫామ్ , బ్యాగు, పుస్తకాలు, బూట్లు, వంటి సామాగ్రిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుంబ్రిగుడ మండలానికి చెందిన 28 మంది ఆదివాసి అనాథ, పేద ఆదివాసి విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి సుమారు పదివేల రూపాయల ఖరీదైన సామాగ్రిలను ఉచితంగా యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. అనాథ విద్యార్థులకు, పేద విద్యార్థులకు 1 నుండి 12వ తరగతి వరకు దత్తత తీసుకొని ఉచితంగా వివిధ ప్రవేటు పాఠశాలల్లోట్రస్టు ద్వారా విద్యార్థులకు చదివించడం సంతోషకరమని చెప్పారు. వందలాదిమంది తల్లిదండ్రులు చనిపోయిన ఆదివాసి పసిపిల్లలకు కూడా ఉచితంగా పాల డబ్బాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సేవలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గసభ పంచాయతీ సర్పంచ్ సునీత, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, ట్రస్టు సభ్యులు నీలి జోష్, న్యాయవాది సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా

జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-బెలగాం: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరెంటెండెంట్ డా. నాగశివజ్యోతి మాట్లాడుతూ 2004 నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. రక్తాన్ని ఇవ్వండి, ప్లాస్మా ఇవ్వండి, జీవితాన్ని పంచుకోండి అని ఆమె చెప్పారు. రక్తం అనేది ఒక వ్యక్తి మరొకరికి అందించగల అమూల్యమైన సహకారమని, ఒక జీవితాన్ని లేదా బహుళ జీవితాలను రక్షించడానికి రక్తదానం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. శనివారం జిల్లా ఆసుపత్రిలోని రక్త కేంద్రంకు మొత్తం 50మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్త కేంద్రం ఇంఛార్జి డా. రాజు, రక్త కేంద్రం సిబ్బంది మజ్జి మధు, మురళీ, నాయక్, నాయుడు, స్వామి, కిశోర్, జ్యోతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా మానవ ఆరోగ్య సంజీవిని

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: మండలంలోని పెద బుడ్డిడి గ్రామంలో సచివాలయవెల్ఫేర్ అసిస్టెంట్ వై. సురేష్ దొర ఆధ్వర్యంలో యోగాకార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమంలోముందుగా సూర్య నమస్కారం, ప్రణాయామం మెడిటేషన్ వంటి ఆసనాలను వేయించడం జరిగినది అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళికి ఆరోగ్య సంజీవిని ప్రతిరోజు యోగా చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యల మటుమాయం అవుతాయని యోగాలో కొన్ని ప్రక్రియల వలన మనసు బుద్ధి ఆధీనంలో ఉంటుందని కావున ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 15 నిమిషాల పాటు అయినా యోగా చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ ఎం ఈశ్వరరావు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు వావిలపల్లి వరహాల నాయుడు అంగన్వాడి కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉపాధి హామీ వేతన దారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో తల్లుల ఆనందం

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: గత ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే వారందరికీ పథకాన్ని వర్తింప చేస్తామని చెప్పి ,నేడు దాన్ని కార్యాచరణ రూపొందించి తమ ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయడం ఎంతో ఆనందంగా ఉందని, చంద్రబాబు నాయుడు అంటే ఎంతో నమ్మకం ఉండబట్టే ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నామని ,ఇచ్చిన మాట నిలబెట్టుకుని తల్లుల కళ్ళల్లో ఆనందం చూశారని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వం అందించిన తల్లికి వందనం పథకంతో నగదును ప్రభుత్వం ఆయా తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఈ నగదు తో పిల్లల్ని బాగా చదివించుకోగలుగుతామని పలువురు తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో ఒకే ఇంట్లో గల ముగ్గురు ఆడపిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం చెప్పిన విధంగా తల్లికి వందనం ద్వారా నగదు జమ చేయడంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం సంబరాలు చేశారు. గ్రామ సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గొట్టపు వెంకటరమణ, గౌరీల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయనపై ఉన్న నమ్మకాన్ని కొనేదారు.ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం నిధులు ప్రభుత్వం మంజూరు చేయడంతో తల్లులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయని ఈ సందర్భంగా అన్నారు.ఈ పథకం ద్వారా మా పిల్లల భవిష్యత్తుకు ఇబ్బంది ఉండదని పలువురు తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఒక్క పిల్లకే అమ్మఒడి పేరుతో ఆర్థిక సాయం చేసేదని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అందరు పిల్లలకు తల్లికి వందనం పేరుతో సాయం చేయడం గొప్ప విషయమని గ్రామానికి చెందిన రూప, లక్ష్మి తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని అందరికీ 13,000 చొప్పున నిధులు తన ఖాతాకు జమ అయ్యాయని వారు ఆనందంతో చంద్రబాబు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విజయ చంద్ర కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న తల్లులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ మిఠాయిలు పంచుకొని కూటమి ప్రభుత్వానికి వారి వారి మద్దతును తెలిపారు.

డబ్బులు జమతో గ్రామాల్లో తల్లిదండ్రుల్లో ఆనందం

విశాలాంధ-పార్వతీపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎన్ డి ఏ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు పాఠశాల ప్రారంభంరోజున తల్లికి వందనం డబ్బులను ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి 13వేల రూపాయలు చొప్పున జమచేయడం గ్రామాల్లో ఎంతో ఆనందంతో తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని చెప్పుకుంటున్నారని మండల టిడిపి నాయకులు బోను దేవీచంద్రమౌళి, గౌరజాన చంద్రమౌళిలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివిన వారందరికీ తల్లికి వందనం డబ్బులు శుక్రవారం పెద్ద ఎత్తున జమ అయినట్లు తెలిపారు.ఒక్కో ఇంటిలో ముగ్గురు పిల్లలకు కూడా రావడం వారు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఈఏడాది ఒకటవ తరగతి జాయిన్ అయిన విద్యార్థులకు కూడా జులై మొదటి వారంలో ఇస్తామని చెప్పడంతో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాఠశాలలో ప్రవేశాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, విద్యా శాఖామంత్రి లోకేష్ కు, ఎమ్మెల్యే విజయ్ చంద్రకు మండలంలోని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని తెలిపారు. పాఠశాల ప్రారంభ సమయంలో డబ్బులు తల్లుల ఖాతాలో వేయడంతో విద్యార్థుల అవసరార్థం ఖర్చు చేస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

తల్లికి వందనం- అమ్మకి ఆనందం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా ఒకటైన తల్లికివందనం పథకం ప్రారంభిం చడం,తల్లి కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని, ప్రతి ఒక్క విద్యార్థి చదువుకోవాలని దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం ద్వారా నేరుగా తల్లులఖాతా లో 15000 జమ చేసినందుకు మండలంలోనిరాజుపేట కాలనీ గ్రామం లో ఎంపీటీసీ, వడ్డాణపు భాగ్యలక్ష్మి సమక్షంలో గ్రామ ప్రజలు సంతోషంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్టింగ్ చేసి ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం లో ముత్యాల. భాను, బూత్ కన్వీనర్ గూటాల రమణయ్య గ్రామ అధ్యక్షుడు పెట్ట ముత్యాలరావు రేవుసింహాచలం జనసేన మండల కార్యదర్శి బాగుల అంజన్ రావు ఎం.కిషోర్ బూత్ కన్వీనర్ ముత్యాల అయిపతి రావు, ఎన్ . దుర్గారావు, బి వెంకన్న,బీసీ సెల్ అధ్యక్షుడు రఘుపతి శివగిరి వెంకన్న రేవురాజారావు గూటాల శంకరరావు ముంజపు పుల్లమ్మ రేవు శారద గూటాల జయమ్మ పెట్ట పోచమ్మ పెట్ట కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురు పిల్లలకు తల్లికివందనం డబ్బులు జమ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని 35 గ్రామపంచాయతీలో శుక్రవారం నాడు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా చదువుతున్న పిల్లలకు సంబంధించి 13 వేల రూపాయలు డబ్బులు తల్లులు ఖాతాలో జమ కావడం పట్ల వారంతా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో చదివిన పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పిన మాటను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్‌కు వారంతా అభినందనలు తెలియజేస్తున్నారు. మండల కేంద్రంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీకు చెందిన ఆకుల సుమన్ బి సోనాలిలకు నలుగురు పిల్లలు అఖిల్, అలేఖ్య,ఆది, అభిషేక్ లకు చెందిన తల్లికి వందనం డబ్బులు 52 వేలు వచ్చినట్లు నాయకులు తెలిపారు.నలుగురు పిల్లలకు ప్రభుత్వం చదువుకోవడానికి ఇంత పెద్ద ఎత్తున డబ్బులను ఆకౌంట్లో వేయడం వారి ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు వారు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా అంగన్వాడీ నుంచి కొత్తగా 1వతరగతికి జాయిన్ పిల్లలు, మరియు 10 వ తరగతి పూర్తయి కొత్తగా ఇంటర్ లో చేరే పిల్లలు పేర్లు ప్రస్తుత అర్హుల జాబితాలో కనబడవని , ఈనెల 21 నుంచి 26 వరకు వీరి నమోదు ప్రక్రియ జరిగి, 30న వెలువడే తుది జాబితాలో వీళ్లపేర్లు వచ్చి, జూలై మొదటి వారంలో వారి డబ్బులు జమవుతాయని అధికారులు తెలిపారు.

విశాలాంధ్ర-చింతపల్లి : తల్లికి వందనం పథకం విద్యార్థుల తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందాన్ని నింపిందని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఆంద్రాబు లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా చదువుతున్న ప్రతి విద్యార్థి పేరిట విద్యార్థుల తల్లిల ఖాతాలలో తల్లికి వందనం నగదు జమ కావడంతో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రుల ముఖాలలో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం అన్నారు. వైకాపా ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహనరెడ్డి ఇద్దరు పిల్లలకు ఇస్తానని చెప్పి ఒక్కరికి మాత్రమే ఇచ్చిన సందర్భాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బడికి వెళ్ళే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరిట ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కు తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో సూపర్ సిక్స్ లో హామీలను కూడా కుటమి ప్రభుత్వం త్వరలోనే నెరవేరుస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని స్వాగతించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొందాం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. శనివారం సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని, పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని, తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయట పెట్టలేదన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముస్లిములు పాకిస్తాన్ వెళ్లిపోవాలని ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతు న్నారని అన్నారు.సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వై.నాయుడు, వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పి. రాజశేఖర్, బి.వి.రమణ, రెడ్డి వేణు, డి.రమణారావు మరియు వై.మన్మధరావు, సింహాచలం, రెడ్డి ఈశ్వరరావు, ఎం. ఉమామహేశ్వరీ, బి.లక్ష్మి పాల్గొన్నారు.

రక్తదానం చేయండి...ప్రాణదాతలుకండి

విశాలాంధ్ర-బెలగాం: ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వలన ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నాం అనే మనసు సంతృప్తితో పాటు ఆరోగ్యవంతులుగా ఉండవ చ్చునని పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డా. గొర్లి నాగభూషణరావు అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా ఆసుపత్రి వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి నుండి ప్రధాన రహదారి మీదుగా మరల ఆసుపత్రి వరకు జరిగిన ఈ ర్యాలీ ముగింపు కార్యక్రమంలో డా. నాగభూషణరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సరైన సమయంలో రక్తం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని రక్తం కొరత లేకుండా ఉండాలంటే ప్రజలు ముఖ్యంగా యువత రక్తదానం చేయటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక్క యూనిట్ రక్తం ద్వారా ఆపదలో ఉన్న ముగ్గురిని రక్షించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నాగశివజ్యోతి, ఆర్ఎంఓ డా. శ్యామల, బ్లడ్‌బ్యాంక్ ఇంచార్జి డా. రాజు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మజ్జి మధు, మురళీ, నాయక్, నాయుడు, స్వామి, జ్యోతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం... మరొకరికి ప్రాణదానం

ప్రాణాన్ని రక్షించే రక్తదాన సాయం వెలకట్టలేనిది

ఏరియా ఆసుపత్రి సూపరిండెండెంట్ ఇందిరా ప్రియాంక



విశాలాంధ్ర-చింతపల్లి : సాటి మనిషికి అందించే సాయం ఏదైనా గొప్పదే, అదే ప్రాణాన్ని రక్షించే (రక్తదానం) సాయం అయితే ఆది వెలకట్టలేనిదని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవంను పురస్కరించుకొని శనివారం ఆమె మాట్లాడుతూ మనమిచ్చే రక్తం మరొకరికి జీవితం అని, మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. రక్తదానం చేద్దాం ఆపదలో ఉన్న వారికి అండగా నిలుద్దాం అంటూ ప్రతి ఒక్కరు మానవత్వాన్ని చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. రక్తదానం చేసి అత్యవసర సమయాలలో రక్త నిలవలను సేకరించి ఎందరికో ప్రాణ దానం చేసిన, చేస్తున్న ప్రతీ ఒక్కరికీ పేరు పేరున ప్రపంచ రక్త దాతల దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వైద్యులు చంద్ర షేక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పాచి పెంట లో యోగా కార్యక్రమాలు



విశాలాంధ్ర-పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో ఒక పనిగా అలవర్చుకోవాలని అన్నారు. గత నెల 21 నుండి ఈనెల 21 వరకు యోగా కార్యక్రమాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల ప్రకారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొని భాగస్వామ్యం కావాలని అన్నారు యోగా వలన ఉపయోగాలను వివరించారు యోగ చేయడంతో ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు ఈ సందర్భంగా యోగా కార్యక్రమాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాత్రోతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

విశాలాంధ్ర-బెలగాం: ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకిక తత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. శనివారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనం నుండి చర్చి సెంటర్ వరకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లింలపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయట పెట్టలేదన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముస్లింలు పాకిస్తాన్ వెళ్లిపోవాలని ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారన్నారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న పవన్ కళ్యాణ్ ఇలా మాట్లాడటం సరైనదికాదని, లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలని, సిపిఎం దేశ సమైక్యతకు కట్టుబడి ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌ని ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. సైనికులు, ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వై నాయుడు, వి. ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పి. రాజశేఖర్, బి.వి రమణ, రెడ్డి వేణు, డి.రమణారావు, వై.మన్మధరావు, సింహాచలం, రెడ్డి ఈశ్వరరావు, ఎం. ఉమామహేశ్వరి, బి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



విశాలాంధ్ర-బలిజిపేట: బలిజిపేట సచివాలయంలో సెక్రటరీ ఆధ్వర్యంలో యోగాంధ్ర డెమోనిస్ట్రేషన్ ప్రోగ్రాం లో భాగంగా శనివారం ఉదయం యోగాపై అవగాహనా కార్యక్రమం లు చేపట్టారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ వైద్య సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి కార్మికులు పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రం లో ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ కార్యక్రమం లు చేపట్టారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకుంటున్న దుకాణదారులు..



విశాలాంధ్ర-జీకే వీధి: మండల కేంద్రంలో అధికారులు హెచ్చరికలతో స్వచ్ఛందంగా వ్యాపారులు ఆక్రమణలు తొలగిస్తున్నారు. జిల్లాలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను తొలగించేందుకు న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచనలతో మండల తహశీల్దార్ మండల కేంద్రంలో సర్వే నిర్వహించి ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. సోమవారం లోగా స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించు కోవాలని లేకుంటే అధికారికంగా యంత్రాలతో తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో శనివారం రోడ్డుకి ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించుకుంటున్నారు. దీంతో రహదారికి ఇరువైపులా ఖాళీ ఏర్పడుతోంది. జీకే వీధి తో పాటు మండలంలో ఆర్వి నాగర్,దారకొండ,వంటి ప్రధాన గ్రామంలోనూ సర్వే నిర్వహించి నోటీసులు జారీ చేస్తామని తహసిల్దార్ తెలిపారు.

తల్లికి వందనం మాకు వర్తింప చేయాలి

పారిశుధ్య కార్మికుల నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: తల్లికి వందనం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ వర్కర్స్ కువర్తింపచేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం మున్సిపల్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ కార్మికులు నిరసన తెలియజేశారు. సిఐటీయు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో శానిటరి ఇన్ స్పెక్టర్ కర్రి పకీరునాయుడుకివినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైయస్ ఆర్ సిపి ప్రభుత్వం అమ్మఒడి పేరుతో కార్మికులందరికి డబ్బులు వేసిందని, ఇప్పటి కూటమి ప్రభుత్వం తల్లికివందనం పేరుతో మంజూరు చేసిన వారిలో నిజమైన అర్హులైన కార్మికులకు డబ్బులు పడలేదని ఇది అన్యాయమన్నారు.నిజమైన అర్హులను గుర్తించి ఆంక్షలు మార్పుచేసి తల్లికివందనం అందరికి వర్తింపచేయాలని అన్నారు. లేనిపక్షంలో భవిష్యత్ లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగవంశం శంకర్రావు,చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ,పి. నరేష్, నాగవంశం మల్లేష్, బి.సంతోష్ కుమార్, లీల, చిరంజీవి, ఈశ్వరమ్మ, లక్ష్మి, మరియమ్మ, మంగరాజు, లీల కార్మికులు పాల్గొన్నారు.

ఏరువాడలో విజయవంతంగా వైద్య శిబిరం

డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి



విశాలాంధ్ర-చింతూరు: ఎక్కడ వైద్య అవసరం ఉంటే అక్కడ ఉండే వైద్య సేవలే నిజమైన ఆరోగ్య వ్యవస్థకు పునాది అనే నినాదంతో ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు తీసుకొని తులసిపాక వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, చింతూరు మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కు గ్రామమైన తులసిపాక నుండి సుమారు 15 కిలోమీటర్ దూరంలో ఉన్న 7 కొండలు దాటి ఉన్న ఏరువాడ గ్రామం లో వైద్య శిబిరం శుక్ర, శనివారం రెండు రోజులు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. భయంకరమైన అటవీ ప్రాంతంలో కొంత దూరం ట్రాక్టర్ పై వెళ్లి కొంత దూరం కాలినడక పై వ్యయ ప్రయాసలకు కోర్చి ఏరువాడ గ్రామ చేరుకొని వైద్య సేవలు అందించారు. అక్కడ ఉన్న 25 కుటుంబాలకు ప్రతి వ్యక్తికి వైద్య సేవలు అందించారు. ప్రతి ఇంటికి మలేరియా నివారణకు ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు చెప్పారు. పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు శుభ్రతపై విద్యా మార్గదర్శనం చేశారు. 25 కుటుంబాల్లో వంద మందికి మలేరియా జ్వరాలు అంటువ్యాధులకు చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. దాతలు సహకారంతో కొండరెడ్లకు దుస్తులు, బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఏరువాడలో జరిగిన ఆరు పెళ్లిళ్లకు ముఖ్యఅతిథులుగా, చుట్టాలుగా, డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గంగరాజు సూపర్వైజర్, అంజిబాబు హెల్త్ అసిస్టెంట్, నరేష్ ఫార్మాసిస్ట్, ధర్మా హెల్త్ అసిస్టెంట్, శివుడు (ఎస్ఎస్ఓ), సుశీల ఆశా వర్కర్, రాములమ్మ ఆశా వర్కర్, జ్యోతి అంగన్వాడీ టీచర్, సురేష్ ఫీడర్ (ఈయంటీ) తదితరులు పాల్గొన్నారు.

జెకె సిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సింగ పేట లో మంచినీటి బోరు

విశాలాంధ్ర -చింతూరు: మండలం లోని ముకునూరు గ్రామపంచాయతీ పరిధిలో నర్సింగ పేట గ్రామంలో జెకె సీటి ట్రస్ట్ చైర్మన్ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ త్రాగునీటి బోరును ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. వేసవికాలం తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్న క్రమంలో ఈ విషయాన్ని జెకె సిటీ చైర్మన్ జమాల్ ఖాన్ కు తమ గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని విన్నవించారు. దానికి స్పందిస్తూ జమాల్ ఖాన్ వెంటనే రిగ్గును తెప్పించి డ్రిల్లింగ్ చేయించి అనంతరం బోర్ హ్యాండిల్ ను ఏర్పాటు చేశారు. అడిగిన వెంటనే తమ త్రాగునీటి సమస్యను పరిష్కరించిన జమాల్ ఖాన్ను గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సన్యాసిరావు, ఉప సర్పంచ్ దుర్గ, మాజీ టిడిపి మండల అధ్యక్షులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు,గ్రామస్తులు రవ్వ భీమయ్య, బీరబోయిన సత్యనారాయణ, సోడే గంగయ్య పాల్గొన్నారు.

పుట్టపర్తి సత్యసాయి బాబాని దర్శించుకున్న ఎమ్మెల్యే జయకృష్ణ

విశాలాంధ్ర-సీతంపేట: పుట్టపర్తి సత్యసాయి బాబాని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం దర్శించుకున్నారు. జనసేన పార్టీ సత్యసాయి జిల్లా కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి వల్లె రఘునాథ రెడ్డి మరియు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి. శ్రీనివాసులుతో కలసి బాబా ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే జయకృష్ణ కి ట్రస్ట్ సేవలను వివరించారు. సత్యసాయిబాబా సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ కొనియాడారు. ఆసుపత్రులు మరియు విద్యాసంస్థలు ద్వార అనేక మందికి సత్యసాయి బాబా సేవలు చేశారని, బాబా ని ఆదర్శంగా తీసుకుని అందరం ముందుకు సాగాలని జయకృష్ణ కొరారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యేతో పాటు పాలకొండ జనసేన నాయకులు కొండదాడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు: పట్టణం లో 24 వ వార్డు పరిధిలోని సాలూరు దండిగాం రోడ్ మార్గంలో నూతనంగా నిర్మించిన ప్రేమ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం మరియు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు.ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి సంధ్యారాణి ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతూ సాలూరు ప్రాంతంలో సామాన్య ప్రజలకు అతితక్కువ ధరలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రేమ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడం ఆనంద దాయకమన్నారు.ప్రస్తుతం రోజుల్లో వైద్యం ఖరీదైందని పేదలకు ప్రైవేటు వైద్యశాలలు అందని ద్రాక్షలా మారాయన్నారు.ఇటువంటి తరుణంలో పేదలకు అందుబాటు ధరలలో అన్నిరకాల పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు జరిపే ఆసుపత్రి ని ప్రారంభించడం సాలూరు ప్రాంత వాసులకు ఉపయోగకరమన్నారు.ఆసుపత్రిని పూర్తిస్థాయి లాభాపేక్షతో కాకుండా కొంతమేరకు సేవా దృక్పథం తో నిర్వహిస్తామని నిర్వాహక వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే ఆర్ పి భంజ్‌దేవ్,పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి,డబ్బి కృష్ణ,డా.బవిరెడ్డి శ్యామ్యూల్ పాల్గొన్నారు.

మండలంలో 35 పంచాయతీలో యోగాంధ్ర

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని 35 గ్రామపంచాయతీలో శనివారం నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో ఎం ఎల్ ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వర్మలు తెలిపారు. అన్ని శాఖలఅధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు,అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 21న ప్రపంచ యోగ దినోత్సవ సందర్భం గా పెద్దఎత్తున కార్యక్రమాలను ప్రతిరోజు చేపడుతున్నట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున యోగా

విశాలాంధ్ర- పార్వతీ పురం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు జరిగాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న నేపథ్యంలో, దానికి సన్నాహక చర్యలు మరియు యోగ అభ్యాసన క్రింద ఈకార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 3,800 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రతి చోటా పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి యోగాలో పాల్గొనడం విశేషం. ఈఏర్పాట్లను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, స్థానిక అధికారులు చేపట్టగా, పలు చోట్ల ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వామ్యమయ్యారు. యోగా కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని, గర్భిణీలను మినహాయింపు చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునివ్వడంతో వారిని ఈకార్యక్రమంలో మినహాయించారు.

రావమ్‌చరణ్, ఉపాసనల పెళ్ళిరోజు సందర్భంగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-బెలగాం: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఉపాసనల పెళ్ళిరోజు సందర్భంగా మరియు వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా శనివారం పార్వతీపురం జిల్లా కేంద్రం ఆసుపత్రిలోని రక్త కేంద్రంలో యువ మెగా ఫ్యామిలీ సేవా సంఘం, రామ్ చరణ్ యువ శక్తి అభిమానులు బ్లడ్ డొనేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో రక్త కేంద్రం సిబ్బంది, మెగా అభిమానులు, రాజాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 2 గేదెలు మృతి

లక్ష 30 వేలు నష్టపరిహారం చెల్లింపు

విశాలాంధ్ర-కొయ్యూరు: ప్రమదశాత్తు హైవే రోడ్డు లో చోటుచేసుకున్న దుర్ఘటనలో రోడ్డు పై వెళుతున్న రెండు పాడి గేదెలను లారీ ఢీ కొనటంతో అక్కడక్కడే గేదెలు మృతి చెందాయి.ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ హెచ్ 516హై వే రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న ఒక వాటర్ ట్యాంకర్ కొయ్యూరు మండలం కాట్రగడ్డ సమీపంలో హై వే రోడ్డు పై రెండు పాడి గేదెలు వెళు తుండగా వాటిని వాటర్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో ఆ గేదెలు అదే రోడ్డులో స్పాట్ లోనే మృతి చెందాయి. దీంతో ఇదే రోడ్డు లో వెళుతున్న పలువురు చూసిన ఈ సంఘటన హైవే రోడ్డులో పనిచేస్తున్న వాహనదారులకు తెలపగా తమకెమి తెలియదని చెప్పటంతో పాడి గేదెల యాజమాని వెలుసురి రామారావు గ్రామస్తులతో చర్చించి గేదెలు మృతి చెందటానికి గల ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో హై వే రోడ్డు లో పనిచేస్తున్న ఒక లారీనీ మరో లారి లాక్కొని వెళుతున్న నేపథ్యంలో భాదితులు ఆయా లారీని లాక్కొనే కారణాలను తెలుసుకున్నారు. దీనిలో ఒక లారీకి ఎదుర పార్ట్ దెబ్బతిని ఉండగా అనుమానించిన కాట్రగడ్డ, నడింపాలెం గ్రామాల గిరిజనులు వాటిని నిలిపేశారు. దీంతో దెబ్బ తిన్న లారీకి మృతి చెందిన గేదే తల వెంట్రుకలు గుచ్చుకుని ఉండటం, యాకిస్సెంట్ అయిన ప్రదేశంలో లారీకి చెందిన ఎదుట మటగ్రర్ పడిఉండటంతో హై వే లారి ఢీ కొట్టడతోనే రెండు గేదెలు మృతి చెందినట్టు గుర్తించిన అనవాలతో ధ్రువీకరించారు. భా దితుడు ఎలుసూరి రామారావు చెందిన 2, గేదెలు రెండు లక్షల విలువ ఉంటుందని ,ఆ అమౌంట్ పూర్తిగా చెల్లిస్తేనే లారీలను వదులుతామని లేనిపక్షంలో కేసు పెడతానని తెలపటంతో గ్రామస్తులతో చర్చల అనంతరం లారీ యాజమాని 1.30 లక్షల రూపాయిలు రెండు గేదెలకు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు . దీంతో సమస్య పరిష్కారం అయినట్టు నడింపాలెం గ్రామస్తులు, భదితుడు రామారావు తెలిపారు.

రోడ్డు విస్తరణ విషయంలో వైసిపి ద్వంద్వ వైఖరి సరికాదు : ఆదివాసీ పార్టీ

విశాలాంధ్ర-జీకే వీధి: ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ విషయంలో మీ పార్టీ ద్వంద్వ వైఖరి ఎందుకు అని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రశ్నించారు. ఆర్ అండ్ బి రోడ్డు అక్రమ నిర్మాణాలను తొలగించి,విస్తరణ చేయాలని ఎమ్మెల్యే ప్రకటన సంతోషకరం, కానీ ఆర్ అండ్ బి రోడ్డు స్థలాలపై అక్రమ నిర్మాణాలు చేస్తే,వాటిని తొలిగించాలని హై కోర్టు ఆదేశిస్తే మీ పార్టీ నాయకులు వ్యతిరేకించడం సరికాదన్నారు. వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ లు రోడ్డు ప్రక్కన అక్రమ నిర్మాణాలు తొలగిస్తే శవాల గుట్టగా,స్మశానంలాగా మారి పోతుందని తెగ గగ్గోలు పెడుతున్నారని ,నష్ట పరిహారం ఇవ్వాలని కొందరు కోరుతున్నారని గుర్తు చేశారు. విశ్వేశ్వరరాజు వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే కాకుండా,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఉన్నారు కదా, తమ పార్టీకి చెందినవారిని ఎందుకు నిరోధించడం లేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే, తెదేపా పాడేరు నియోజకవర్గం ఇన్ ఛార్జ్ గిడ్డి ఈశ్వరి వర్తక సంఘం వారితో కలసి అక్రమ నిర్మాణాలు సక్రమమే అంటూ జిల్లా కలెక్టర్ మీద ఒత్తిడి తేవడం తెలిసిన విషయమేనని,ఆమెకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ విషయంలో హైకోర్టు ఆదేశాలను పాటించాలంటున్నారా అనే సందేహం కలుగుతోందన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ విషయంలో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పెద్ద,పెద్ద నాయకులు మాట్లాడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని, ఎన్నికల సమయంలో ఎంతో మంది నాయకులు ప్రజల పక్షాన ఉంటామని ఇప్పుడు మొహం చాటేసారని ఆయన ఎద్దేవా చేసారు.

కేంద్రంలో సుపరిపాలనకు 11 ఏళ్ళు

- ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్లలో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపు.
- బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర-చింతపల్లి: ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్లలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం చేయాలని బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు, పాడేరు శాసనసభ కన్వీనర్ కూడా కృష్ణారావు లు అన్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ ఆధ్వర్యంలో చింతపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో శనివారం వికశిత్ భారత్ సంకల్ప సభ, యోగా దినోత్సవం, శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టి 11 ఏళ్ళు పూర్తి కావడం చరిత్ర అన్నారు. 11 ఏళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచి బిజెపిని ప్రజలకు మరింత చేరువ చేసిన ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రాబోవు రోజుల్లోనూ కేంద్రంలో బిజెపి సర్కారు మరిన్ని సంక్షేమ పథకాలను అమలుపరచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోనంగి బాలయ్య పడాల్, కదుళ్ళ శ్రీనివాసరావు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎమ్ మంగతల్లి, శ్రీను, సోమేశ్, లక్ష్మణరావు లతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

మండలం లో యోగాంధ్ర ర్యాలీలు

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం లో శనివారం ఎంపీడీవో బాపన్న దొర ఆద్వర్యం లో పలుచోట్ల యోగాంధ్ర ట్రైల్ రన్ లో బాగంగా ర్యాలీలు,యోగాసనాలు నిర్వహించారు. యోగా జీవనశైలి ఆరోగ్యానికి మార్గదర్శి అంటూ నినాదాలు చేశారు.మండల ఎగువ ప్రాంతం బొడ్డగండి, పాతకోట, కానివాడ, చింతలపూడి మరియు దిగువ పరిధి లోని వై.రామవరం,చామగడ్డ, యార్లగడ్డ, కె.ఎర్రగొండ, పనసలపాలెం, దాలిపాడు తదితర పంచాయితీ లలో ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఆయుష్ డాక్టర్ శ్రీ హరి, ఎంపీటీసీ కరకా వెంకట రమణ,పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ, హెల్త్, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్ధులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సంపూర్ణ యోగా తో ఆరోగ్యం

ఎంపీడీవో జెడివి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా అలవరు చుకుని ఆచరిస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడ వో జీవీడి ప్రసాద్ అన్నారు. కొయ్యూరు మండలం కొండగొకిరి లో సర్పంచ్ రేగటి మునిలినాయుడు, ఎంపీడీవో ప్రసాద్, సెక్రటరీ, గ్రామస్తులు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో ఎంపీడీవో పలు ఆసనాలను అలవర్చుకునే పద్ధతులను, యోగా చేసి ప్రయోగాత్మకంగా వారితోజరిపించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ దైనందన జీవితంలో యోగ ప్రతి ఒక్కరికి అంతర్భాగం కావాలన్నారు. యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల పై మండల పరిధిలో ఎంపిక చేసిన పివిటీజి గ్రామాల్లో ఈ నెల 16 నుంచి డి ఏ మరియు జె ఏ ప్రోగ్రాం లను నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎంపిక చేసిన వివరాలను ఎంపీడీవో ప్రకటించారు.

ఆర్ అండ్ బీ నిర్లక్ష్యం...

మురుగు నీట మునిగిన త్రినాథ స్వామి ఆలయం

విశాలాంధ్ర-కురుపాం: తోటపల్లి-గుణుపురు రోడ్డు లో తోటపల్లి నుంచి కురుపాం వరకు నిర్వహిస్తున్న రహదారి విస్తరణ పనులు లో ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కారణంగా శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మురుగు నీరు త్రినాథ స్వామి ఆలయంలోకి ,పైనల వీది లోనికి ప్రవేశించింది. ఈసమస్య పై వార్తాపత్రికలు లో కథనాలను ప్రచురించిన సంబంధించిన శాఖ కు బేఖాతరు. దశాబ్దాల కాలం తర్వాత జరుగుతున్న శాస్వత నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండటంతో సమస్య యధాతధంగా మిగిలి పోయాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయకుంటే కురుపాం గ్రామస్తులు రహదారి నిర్భంధానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. పంచాయతీ గ్రామ కంఠంలో ఉన్న స్థలాన్ని ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులు కాలువ నిర్మాణం అడ్డుకుంటే నిర్మాణం విడిచి పెట్టడం వర్షం మురుగు నీరు మెయిన్ రోడ్డు లోగల త్రినాథ స్వామి ఆలయంలోకి ,పైనల వీధుల్లో చేరటం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయంత్రం ప్రజలు కాంట్రాక్టర్ ను నిలధీసారు.

ఘనంగా సీతారాముల ద్వితీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-సీలేరు: జీకే వీధి మండలం దారకొండ కాలనీలో శ్రీసీతారాముల దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం గుడి కమిటీ సభ్యులు, అలాగే స్థానికులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కన్నుల పండుగగా సీతారాముల వారి కళ్యాణం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షల ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2021 - 2023వ సంవత్సరంలో దేవాలయం నిర్మాణం పూర్తి చేసుకొని 2023వ సంవత్సరం సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుని విగ్రహాల ప్రతిష్ట దేవాలయం ప్రారంభోత్సవం సమరసత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడి కమిటీ సభ్యులు గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి శ్రీసీతారాముల వారి దేవాలయం కావాలని సంకల్పిస్తే 2021వ సంవత్సరంలో సమరసత సేవా ఫౌండేషన్ అల్లూరి జిల్లా కన్వీనర్ గొర్లె గణేశ్వరరాజు ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర జోన్ పెద్దలతో మాట్లాడి దేవాలయం మంజూరు మంజూరు చేయించారన్నారు. దేవాలయం మంజూరు చేయడంతో గ్రామస్తులం అందరం పరస్పరం సహకరించుకుంటూ అంరంగ వైభవంగా దేవాలయం నిర్మాణం చేసుకున్నామన్నారు. నేటి నుండి వారం వారం భజనలు ప్రతి నెల ఏకాదశికి నగర సంకీర్తన ప్రతి నెల పౌర్ణమికి సామూహిక హారతులు రెండోవ శనివారం సత్సంగము నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం స్వామి వారి విగ్రహాల ప్రతిష్ట దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తూ కళ్యాణం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కొర్రా రాము, మండల ధర్మ ప్రచారక్ వీరముష్టి, వీరాస్వామి, ఆలయ ఎకమిటీ చైర్మన్ సుంకరి ప్రసాద్, కార్యదర్శి శెట్టి రూప, కమిటీ సభ్యులు గడుతూరి రాములమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి, దేవాలయం అర్చకుడు సాగిన భూపతి, బాలవికాస్ మాతాజీ, తగ్గి వసంత దేవితో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగ పునాది

డిఎంహెచ్ఓ భాస్కరరావు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ప్రతి మనిషి వారి వారి దినచర్యలో, వ్యక్తిగత జీవితంలో బిజీగా ఉంటూ శరీర ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారని దానివల్లే చిన్న వయసులో రోగాల బారిన పడి అనోరాగ్యపాలవుతున్నారని వాటన్నింటినీ అధిగమించడానికి యోగా ఎంతో దోహదపడుతుందని డిఎంహెచ్ఓ ఏం భాస్కరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిన్న బండపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో యోగ ఆసనాలు వేస్తూ చిన్నారులకు యోగ పై అవగాహన కల్పించారు. యోగా అన్నది ఎంతో ప్రాచీన విద్యని ఋషులు మునులు ఎంతోమంది కవులు యోగాను అభ్యసించడం మూలంగానే వారి యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకొని మానసిక ప్రశాంతత పొందారని కొని ఆదారు వ్యక్తిగత జీవితంలో శారీరక ఆందోళన మూలంగానే రోగాలు ప్రభలే అవకాశం ఉందని శరీరాన్ని మెదడును నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు యోగ దోహదపడుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్రావు మాట్లాడుతూ బాల్యం నుంచే యోగ పై అవగాహన ఉండాలని శరీరాన్ని ఉత్తేజపరిచే విధంగా యోగ ఎంతో దోహదపడుతుందన్నారు ఆక్సిజన్ శాతం పెంపొందించడం మూలంగా రోగనిరోధక శక్తి పెరిగి రోగాలు ప్రజలే అవకాశం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి టి జగన్ మోహన్ రావు తో పాటు ఉపాధ్యాయులు, చిన్నారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

హామీలను పూర్తిగా అమలు చేయండి

అరకొరగా అమలు చేసి దప్పు కొట్టుకోవడం సిగ్గుచేటు

భారత విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి జీవన కృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : ఇచ్చిన హామీలను పూర్తిగా అమలుపరచి ఆపై ప్రచారం చేసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి జీవన కృష్ణ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని ఏపీ గురుకుల కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి తల్లికి వందనం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలంటూ తలపెట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. చదువుతున్న ప్రతి విద్యార్థికి ఎటువంటి షరతులు లేకుండా తల్లుల ఖాతాలో 15 వేల రూపాయలు జమ చేస్తానని ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు పరచాలన్నారు. కూటమి సర్కారు ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాలో 13 వేల రూపాయల చొప్పున జమచేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇటువంటి మాట మార్చే విధానాన్ని మానుకోవాలని ఆయన హితవు పలికారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చినప్పుడు మరో మాట మాట్లాడడం చంద్రబాబు నాయుడుకు తగదన్నారు. ఈ విధానాన్ని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. దీనిపై కూటమి సర్కారు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బృందం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా, చింతపల్లి ఎస్ఎఫ్ఐ మండల మండల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకాహారంతోనే జీవుల మనుగడ

శాఖాహార ర్యాలీలో భీమసిం గి ఆశ్రమ నిర్వాహకులు దేవి, రజిత



విశాలాంధ్ర-జి.మాడుగుల: శాకాహారంతోనే జీవుల మనుగడ సాధ్యం అవుతుందని పాకలపాటి గురుదేవుల భీమసింగి ఆశ్రమ నిర్వాహకులు పి.దేవి, పి.రజిత తెలిపారు. జి.మడుగులలో శాఖాహార ర్యాలీని శనివారం నిర్వహించారు. హింసను వదిలి మంచిని ఆదరించాలని తెలిపారు. జీవులను బాదించకూడదని, ఏ జీవి బాధతో మనం వినోదించకూడదని తెలిపారు. బ్రతకడానికి జీవులను హింసించ నవసరం లేదని, కూరగాయలు చాలని అన్నారు. జీవులను హింసించరాదని, శాఖాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్న శారీరకంగా, మానసికంగా మరి ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి ఎదగాలన్నా, అసూయ ద్వేశాలకు బదులుగా ప్రేమ, సహాయ సహకారాలు పెరగాలన్నా, ఈ భూ గ్రహంపై శాంతి స్థాపన జరగాలని తెలిపారు. స్థానిక సంగులోయ నుంచి జి.మాడుగుల వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో శాకాహారం ర్యాలీ జిల్లా కన్వీనర్ ఎం.త్రిమూర్తులు, జిల్లా మానిటర్ కె.బంగారమ్మ, మండల కన్వీనర్ జె. గోవిందరావు, సంగులోయ స్వామీజీ సింహాచలం, ఏజెన్సీ 11 మండలాల నుంచి పాకలపాటి గురుదేవులు భక్తులు పాల్గొన్నారు.